జగనన్న పథకాలు చంద్రబాబు కాపీ

● ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తీవ్రంగా విమర్శించిన చంద్రబాబు నేడు అవే పథకాలను కాపీ కొట్టి పేర్లు మార్చి టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో అంటూ ప్రజల ముందుకు తీసుకొచ్చాడని ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి ఘాటుగా విమర్శించారు. ఊటకల్లులో మంగళవారం సర్పంచ్ లహరిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత సూర్య నారాయణరెడ్డితో కలిసి ఆయన గడగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రతి గడప వద్దకూ వెళ్లి నాలుగేళ్ల ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో సీఎం వైఎస్ జగన్ పేదలకు డబ్బు పప్పులు, బెల్లంలా పంచి పెడుతున్నాడని ఇన్నాళ్లూ ఏడ్చిన చంద్రబాబు మరి ఇప్పుడెందుకు అవే పథకాలను ఇస్తానని చెబుతున్నాడని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పులపాలై దివాలా తీసిందని గగ్గోలు పెట్టేవాడు నేడు అవే పథకాలు తానూ ఇస్తానని గొప్పలు చెబుతున్నాడన్నారు. సీఎం జగన్ డబ్బు విచ్చలవిడిగా పంచుతూ రాష్ట్రాన్ని మరో శ్రీలంక చేశాడని ఆరోపించిన చంద్రబాబు మరి ఆయన పంచితే మాత్రం శ్రీలంక కాదా అని ప్రశ్నించారు. సీఎం జగన్ పథకాలను విమర్శించిన చంద్రబాబు చెప్పినవన్నీ శుద్ధ అబద్ధాలని తేలిపోయాయన్నారు. ఏ రోజుకి ఆరోజు మాట మాట్లాడే నైజం ఉన్నవాడి మాటలు నమ్మి ప్రజల ఓట్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ప్రణాళికా బద్ధంగా చెప్పినవి చెప్పినట్లు టైమ్‌కి అన్నీ అందిస్తున్న జగనన్న పరిపాలన గమనించమని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు, ప్రజలకు అందుతున్న విధానాన్ని గమనించి 2024లో జగనన్నకే ఓటు వేసి మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మంచానికే పరిమితమైన షేక్ బీబీ అనే మహిళను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, బళ్లారి రాజ్‌కుమార్‌రెడ్డి, గురుప్రసాద్ యాదవ్, బెడల వెంకట్రాముడు, రామ్ రంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు వాల్మీకి శివరామ్, వరదరాజులు, ఫారూక్, రమణ, నాయకులు లాలు నాయక్, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, తహసీల్దార్ మహబూబ్ బాషా , ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి


నవరత్నాల లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, 2024లో ఇంటి పెద్దకొడుకు జగనన్నను సీఎం చేయడమే ప్రథమ కర్తవ్యమని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీకాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ మన ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో సర్పంచు పెద్ద ఓబులమ్మ నివాసం వద్ద ఎమ్మెల్యే, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ భోగతి విజయప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని ప్రజలకు చదివి వినిపించారు. పాతపేటలో బస్‌షెల్టర్ కావాలని స్థానికులు అడిగారు. డ్రైనేజీ నీరు నిలిచాయని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. 2024లో అందరం కష్టపడి జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాలను అందిస్తున్నామన్నారు. సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు రామకృష్ణ, వెంకటప్రసాద్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, విద్యుత్‌శాఖ ఏఈ పద్మనాభరెడ్డి, ఏఓ రామకృష్ణుడు, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, ఏఓ రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు రామాంజులరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ సూరి, నాయకులు చాంద్‌బాషా, తిరుపాల్‌రెడ్డి, చిన్న ఓబులేసు, మూర్తి, రమణ, జీపు శేఖర్, హాజీ, నజురున్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ


టీబీ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడిపత్రి టౌన్: చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 35 మంది టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని లయన్స్‌క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు హరినాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్, లావణ్య, సుధాకర్, క్లబ్ సభ్యులు రాజేశ్వరి, హైమావతి, హరిత, సంజీవ రెడ్డి, రాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

తాడిపత్రి టౌన్: స్థానిక సీపీఐ కాలనీలో కమలమ్మ అనే మహిళ సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీపీఐ కాలనీ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ నరేష్, వెల్ఫేర్ సెక్రటరీ కేశవ మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల చెక్కును మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత


ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అందిస్తున్న షాకీర్

తాడిపత్రి టౌన్: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో మంగళవారం ధర్మవరానికి చెందిన ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తురాలు నారాయణమ్మకు రూ.48 వేలు విలువ చేసే ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను రోటరీ క్లబ్ సభ్యులు వితరణ చేశారు. కొన్నేళ్లుగా ఊపిరితిత్తుల వ్యాధితో నారాయణమ్మ బాధపడుతోంది. విషయం తెలుసుకున్న రోటరీ క్లబ్ సభ్యులు క్లబ్ అధ్యక్షుడు షాకీర్ ఆధ్వర్యంలో బాధితురాలి కుమారుడు చంద్రమౌళికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కిశోర్, సభ్యుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈకి సన్మానం

పామిడి: స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం బదిలీపై వెళ్తున్న ఏఈ అశత్థనారాయణను బంజారా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అశత్థనారాయణ సేవలను వక్తలు కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బద్రీనాయక్, బీజీఎస్ పీపీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అశ్వత్థనారాయణ స్థానంలో గుత్తి నుంచి వచ్చిన ఏఈ వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు.

రీ సర్వే పనుల పరిశీలన


రీ సర్వే పనులపై చర్చిస్తున్న తహసీల్దార్ సుమతి

యల్లనూరు: మండలంలోని ఆరవేడు, కాచర్లకుంట గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే పనులను మంగళవారం తహసీల్దార్ సుమతి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల వద్ద రైతులతో మాట్లాడి సర్వే పనులు చేయాలన్నారు. రైతులు హద్దులను చూపించి సహకరించాలన్నారు. వీఆర్వోలు రేణుక, గురుమూర్తి, మండల సర్వేయర్ షర్వాని, గ్రామ సచివాలయ సర్వేయర్లు గురుసాయి, భూపాల్, శ్రీనివాస్, చంద్ర తదిరులు ఉన్నారు.

రేపు సంగీత విభావరి

గుత్తి: పట్టణంలోని కెఎం ఫంక్షన్ హాల్లో(ఓల్డ్ రాయల్ థియేటర్) గురువారం సాయంత్రం ఎస్పీ బాల సుబ్రమణ్యం జయంత్యుత్సవాల్లో భాగంగా సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఎస్పీ బాలు కల్చరల్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రకటన విడుదల చేశారు. విజేతలకు విలువైన బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ తదితరులు

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీ(22వ వార్డు)లో రూ. 6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వార్డు కౌన్సిలర్ సులోచన భూమి పూజ చేశారు. మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, డీఈ ఇంతియాజ్, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, కాంట్రాక్టర్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

పామిడి: పట్టణ గుత్తి బీసీసీ రోడ్డు హోండా షోరూమ్ సమీపాన మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..పామిడి బీసీ కాలనీవాసి శంకర్ పీ కొండాపురంలో దేవర కార్యక్రమం ముగించుకొని పామిడికి బయలుదేరాడు. అలాగే పామిడి నుంచి రామరాజుపల్లికి ముత్యాల్‌రెడ్డి బైక్‌పై బయలుదేరివచ్చాడు. హోండా షోరూమ్ సమీపాన బైకులు రెండు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈప్రమాదంలో శంకర్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ముత్యాలరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను హుటాహుటినా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శంకర్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్లారు. పామిడి ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ఉరుసు


గంధంతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం సమీపంలో వెలిసిన హజరత్ ఖాజా బందే నవాజ్ గేసుదాస్ ఉరుసు మంగళవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా హజరత్ దర్గా వద్ద నుంచి కోటలోని సయ్యద్ బాషా దర్గా వరకు గంధం ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతతో చేపట్టాలి

గార్లదిన్నె: ఉపాధి హామీ ద్వారా రైతులకు ఉపయోగపడే నాణ్యమైన ఉపాధి పనులు చేయాలని ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. మంగళవారం తిమ్మంపేట, పాపినేపాళ్యంలో ఉపాధి పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి కూలీల మస్టర్లు తనిఖీ చేసి మస్టర్లో పేర్లు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరుకావాలన్నారు. అలాగే ప్రతి కూలీకి రూ.272 గిట్టుబాటు వేతనం వచ్చేలా పని చేయించాలన్నారు. గ్రామాల్లో పనులు అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఏపీఓ నాంచారమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


తిమ్మంపేటలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ తేజోత్స్న

రాజకీయ శిక్షణ చాలా అవసరం


మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు రూరల్: పార్టీల శ్రేణులకు రాజకీయ శిక్షణ తరగతులు ఎంతో అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ పేర్కొన్నారు. మంగళవారం కసాపురంలోని ఆలయ యాత్రికుల వసతి సముదాయంలో రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్టు పార్టీకి వందేళ్ల చరిత్ర ఉందన్నారు. దేశంలో డిజిటల్ విధానాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో కమ్యూనిస్టు నాయకులు ఆ దిశగా అప్డేట్ కావాలన్నారు. మత రాజకీయాలను తరిమికొట్టేందుకు క్షేత్ర స్థాయిలో పని చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

యల్లనూరు: సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యులు లోకేష్‌కుమార్ సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0–2నెలలు, 2 నుంచి 5 ఏళ్లున్న పిల్లలకు ఇంటింటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. అలాగే వడదెబ్బ, విరేచనాలు, వాంతులు వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీహెచ్ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు శ్రీదేవి, ప్రమీల, రమణమ్మ, స్నేహలత, లక్ష్మీ, హెల్త్‌అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ లోకేష్‌కుమార్

గృహ సందర్శన తప్పనిసరి

గార్లదిన్నె: మండలంలోని ప్రతి ఆశా కార్యకర్త గృహ సందర్శన తప్పక చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశావర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ గౌతమి మాట్లాడుతూ ఆశావర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సేవలు అందించాలన్నారు. మంగళవారం నుంచి ఈనెల 17వరకు ఉధృత అతిసారం నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. ఆశా వర్కర్లు ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అతిసారతో బాధపడుతున్న ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ,జింక్ మాత్రలు ఇవ్వాలన్నారు. డాక్టర్లు హసీనా, సీహెచ్ఓ లోక్‌నాథ్, ఆశా నోడల్ అధికారి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: మండలంలోని గాజులపల్లి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న లక్ష్మీదేవి అనే మహిళను మంగళవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ గ్రామంలో నాటుసారా విక్రయిస్తోందని సెబ్ పోలీసులకు సమాచారం అందింది. సెబ్ పోలీసులు లక్ష్మీదేవి ఇంట్లో సోదాలు నిర్వహించి ఆరు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని ఆమెను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసినట్లు సెబ్ ఎస్ఐ అలీ అహ్మద్ తెలిపారు.

చెత్తకు నిప్పంటుకొని అగ్ని ప్రమాదం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో చెత్తకు నిప్పంటుకొని మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు కృషి చేశారు. అండర్ గ్రౌండ్‌లో భారీగా చెత్త పేరుకుపోవడంతో అటుగా వెళ్లిన పాదచారులు సిగరెట్ కాల్చి వేయడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

వ్యక్తి మృతి


మస్తాన్‌వలి(ఫైల్)

పామిడి: కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పీ కొండాపురం వాసి మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన డీ మస్తాన్‌వలి(48) గతనెల 30న పీ కొండాపురం రోడ్డులోని శ్రీపురం టౌన్‌షిప్ వద్ద బైక్‌పై వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మున్నీ, కుమార్తె దిల్షా, కుమారుడు టిప్పు సుల్తాన్ ఉన్నారు.

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

తాడిపత్రి: ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో తాడిపత్రి– కడప ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం రాత్రి ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొంది. ఘటనలో లారీ డ్రైవర్ సుబ్బరాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గుంతకల్లు: కాలుష్యం పెరిగిపోయి జన జీవనం ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని స్థానిక శంకరానంద డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడం యజ్ఞంలా చేపట్టాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకునే బాధ్యత తను మరువరాదన్నారు. ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్ పీఓలు ప్రకాష్, బి.క్రిష్టయ్య, పి.శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి రూరల్: తొండపాడు, కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రాలను ఏసీడీపీఓ ఢిల్లీశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని కేంద్రాలకు వెళ్లి చిన్నారుల హాజరు పరిశీలించారు. పిల్లలకు రోజు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా అని విచారించారు. అనంతరం కొత్తపేటలో కొడిగుడ్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా రాములమ్మ దేవర

పామిడి: స్థానిక కొండూరురోడ్డులోని రాములమ్మ ఆలయం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి దేవర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని శోభాయానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జోజోడే కుమార్, నాగభూషణ్‌రావు, అనిల్‌కుమార్, నవీన్‌కుమార్, సురేష్, రమేష్, శ్యామ్‌రావు, కింగ్‌కాంగ్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

అన్నదమ్ములపై దాడి

తాడిపత్రి అర్బన్: ఇళ్ల పక్కలోని రస్తా విషయంలో జరిగిన ఘర్షణలో ఇద్దరు అన్నదమ్ములపై దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో పరమేష్, శివరంగనాథ్ పక్కపక్కనే నివాసముంటున్నారు. అయితే ఇంటి పక్కన ఉన్న రస్తాలో పరమేష్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండడాన్ని అన్నదమ్ములైన శివరంగనాథ్, రవితేజ అడ్డుకున్నారు. వీరిమధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. దీంతో పరమేష్ అతని కుటుంబ సభ్యులు అన్నదమ్ములైన శివరంగనాథ్, రవితేజపై దాడి చేసి చేశారు. ఈ దాడిలో ఇద్దరు అన్నదమ్ములు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

తాడిపత్రి టౌన్: స్థానిక శివాలయం వీధిలోని భగవాన్ సత్యసాయి మందిరం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు మంగళవారం ఘనంగా జరిగాయి. గురువారం సత్యసాయి మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట జరగనుంది. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో అంకురార్పణ, దీక్షహోమం, గణపతి హోమం, గోపూజ, రుద్రాభిషేకం, మహామంగళహారతి నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా కమిటీ కోఆర్డినేటర్ గంగాధర్, సభ్యులు రత్నమయ్య, శ్రీనివాసులు, శ్రీధర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఇద్దరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద మంగళవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పుల్లన్న బైక్‌పై అనంతపురం రోడ్డులో నుంచి బస్టాండ్ వైపు బయలుదేరాడు. ఎదురుగా మరో మరో బైక్ వచ్చి ఢీ కొంది. ఘటనలో తరుణ్, పుల్లన్న గాయపడ్డారు. వారిని స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

చెట్టనాథన్ సహకారం మరువలేనిది

గుంతకల్లుటౌన్: ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి, ఆర్యాధన్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్(ముంబాయి) ఎండీ డి.చెట్టనాథన్ అందిస్తున్న సహకారం మరువలేనిదని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్ అన్నారు. పూర్వ విద్యార్థి చెట్టనాథన్ కళాశాల అభివృద్ధికి అందజేసిన రూ.80 లక్షలతో నిర్మించిన ఆరు అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, డెస్కులు, పార్క్‌ను మంగళవారం చెట్టనాథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చెట్టనాథన్ మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పి తనను ఇంతస్థాయికి ఎదిగేలా కృషి చేసిన ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారమందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం దాతను కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అనంతరం డిగ్రీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు పురస్కారాలను అందజేశారు. అధ్యాపకులు డాక్టర్ పవన్‌కుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.


చెట్టనాథన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్, అధ్యాపకులు

దళిత సర్పంచ్‌పై దుష్ప్రచారం తగదు

బుక్కరాయసముద్రం: దళిత సర్పంచ్‌నైన తనపై దుష్ప్రచారం తగదని బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీకేఎస్ పంచాయతీలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. అయితే కొంతమంది పనిగట్టుకుని తనపై ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. రోడ్లు, ఎల్ఈడీ లైట్లు, బోర్లు, పైపులైన్లు, కొత్తగా విద్యుత్ మోటార్లు, వంటి పనులు చేపట్టామని, వాటికి ఎం బుక్కులు, బిల్లులు ఉన్నాయన్నారు. కేవలం తన ప్రతిష్టను దెబ్బతీయాలనే ప్రచారం చేస్తున్నారన్నారు.

గుంతకల్లు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలి

గుంతకల్లు రూరల్: గుంతకల్లు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో మొత్తం 12 జిల్లాలను ఏర్పాటు చేయాలన్నారు. తీవ్ర కరువు జిల్లా అయిన అనంతలో ఇంకో జిల్లాగా గుంతకల్లును ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. రెవిన్యూ డివిజన్‌గా ఉన్న గుంతకల్లును జిల్లాగా ప్రకటిస్తే వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన

తాడిపత్రి టౌన్: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో బాగంగా కథల పుస్తకాలు, మహానుభావుల జీవిత చరిత్రలు, సైన్స్, క్విజ్, పురాణాలు తదితర పుసక్తల విశిష్టతను గ్రంథాలయాధికారి రవికుమార్‌నాయుడు వివరించారు.

19న బహుజన రాజ్యాధికార సభ

గుంతకల్లుటౌన్: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 19న మదనపల్లెలో జరుగనున్న బహుజన రాజ్యాధికార బహిరంగ సభకు భారీగా తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం, కార్యదర్శి శ్రీనివాసరాజులు కోరారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో రాజ్యాధికార సభ కరపత్రాలను వారు విడుదల చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం

తాడిపత్రి టౌన్: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి నాయకులకు సూచించారు. స్థానిక పుట్లూరు రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోది తొమ్మిదేళ్ల పాలన విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ కన్వీనర్ గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.